క్లుప్తంగా

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

మెరకముడిదాం: ఆడ పిల్లను కాపాడుకుందాం అనే అంశంపై మండల స్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మెరకముడిదాం జెడ్పీ పాఠశాలలో ఎంఈవో - 1 చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గర్భాం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని లిఖిత, చిత్రలేఖనంలో బిళ్లలవలస విద్యార్థిని మణిప్రియ, వక్తృత్వం పోటీల్లో గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన డి.వెంకటేష్ మొదటి బహుమతి గెలుపొందారు. పోటీల్లో విజేతలకు ఎంఈవో చంద్రశేఖర్ బహుమతులను అందజేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

చీపురుపల్లి: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు జరగనున్న పరిష్కార వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు వినియోగదారులు పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ డా.బి.సత్యనారాయణ హాజరై ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను వినియోగదారులు పరిష్కరించుకునేందుకు ఈ వేదిక నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

పరిశీలన



నెలివాడలో బాణసంచా గొడౌన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ, రోళ్లవాక గ్రామాల్లో గల దీపావళి మందుగుండు సామగ్రి గొడౌన్‌లను గజపతినగరం సీఐ జీఏవీ రమణతో పాటు ఎస్సై యు.మహేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌ల నిర్వహణకు సంబంధించి అన్ని అనుమతులు ఉన్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనుమతుల్లేకుండా మందుగుండు సామాగ్రి విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమా, తదితరులు

లక్కవరపుకోట: మండలంలోని కొత్తగంగుబూడి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ మల్లివీడు సెక్టార్ సూపర్‌వైజర్ కె. హైమ ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



ఎస్.కోటలో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

శృంగవరపుకోట: నియోజకవర్గ కేంద్రమైన ఎస్.కోటలో కాంగ్రెస్ నాయకులు ఓట్ చోర్.. గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. దీవీ జంక్షన్, పట్టణ ప్రధాన రహదారి, వీధుల్లో ర్యాలీ చేపట్టి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గేదెల తిరుపతి మాట్లాడుతూ.. ఈవీఎంలను టాంపరింగ్ చేసి బీజేపీ గెలిచిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతల ఈశ్వరరావు, మోహన్, పదాల మణిబాబు, హెచ్.నానాజీ, కృష్ణ, అప్పడు, సురేష్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే కడుబండి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాయుడుబాబు



పెందుర్తి జంక్షన్ సమీపంలో రోడ్డుపై బారికేడ్లను తొలగింప చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, నాయుడుబాబు

కొత్తవలస: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం చేపట్టనున్న నిరసన ర్యాలీని పార్టీ శ్రేణులు విజయ వంతం చేయాలని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు.

జగన్‌మోహన్‌రెడ్డి పెందుర్తి నుంచి అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం నియోజకవర్గంలోని నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలకు వెళ్లే రూట్‌లో పెందుర్తి జంక్షన్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబుతో కలిసి కడుబండి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. అక్కడ రోడ్డుకు అడ్డంగా వేసిన సిమెంట్ బారికేడ్లను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జగన్‌మోహన్‌రెడ్డి పెందుర్తి హైవే జంక్షన్ నుంచి రోడ్డు మార్గంలో నర్సీపట్నం వెళ్లనున్నారని చెప్పారు.ఆ సమయానికి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తరలివచ్చి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. లక్కవరపుకోట,వేపాడ ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు,దొగ్గ సత్యవంతుడు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సర్పంచ్ నీలకంఠంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, తదితరులు

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామ సర్పంచ్ రావాడ నీలకంఠం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు రేగ గ్రామం వెళ్లి సర్పంచ్ నీలకంఠంను బుధవారం పరామర్శించారు. సర్పంచ్‌తో కడుబండి మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ నీలకంఠానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు భార్య పర్యవేక్షణలోనే వైద్యసేవలు అందుతున్నాయి. పరామర్శించిన వారిలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, రేగ,నర్సంపేట ఎంపీటీసీ సభ్యులు బొడ్డు గణపతి, భూమిరెడ్డి స్వామినాయుడు, మాజీ ఎంపీటీసీ భోకం అప్పారావు,పార్టీ నాయకులు భూమిరెడ్డి రామారావు, సీర తాతబాబు, జక్కాన సింహాద్రిప్పడు,నక్క కృష్ణ తదితరులున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు



బక్కునాయుడుపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ మాణిక్యం నాయుడు

వేపాడ: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి కోసం స్టడీ అవర్స్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు సూచించారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల విద్యావనరుల కేంద్రం, బక్కునాయుడుపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి పాఠశాలల పనితీరు, మెనూ అమలుపై ఆరా తీశారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. సందేహాలుంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలభాస్కరరావు, ప్రిన్సిపాల్ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

కలగాడలో పశువైద్య శిబిరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

జామి: మండలంలోని కలగాడలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 70 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి.. 32 పశువులకు సాధరణ వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు అందించారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక అధికారి మురళీకృష్ణ, విజయనగరం డివిజన్ ఉప సంచాలకుడు దామోదర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ, అలమండ, ద్వారపూడి పశువైద్యాధికారులు నరేష్‌కుమార్, భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థినులతో ఎంఈఓ జయశ్రీ, తదితర ఉపాధ్యాయ సిబ్బంది

జామి: ఈ నెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డను కాపాడుదాం అనే అంశంపై విద్యార్థులకు మండల కేంద్రంలో బుధవారం వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.శ్యామ్, ఎ.రిషిత.. కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి. మేఘన విజేతలుగా నిలిచారు. ఈ మేరకు విద్యార్థులను ఎంఈఓ జయశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా అమ్మవారి అనుపోత్సవం



దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తవలస: శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్థానిక విజయనగరం రోడ్డులో ఏర్పాటు చేసిన మంటపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహ అనుపోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. అంతకు ముందు అమ్మవారికి నివేదించిన లడ్డూ ప్రసాదానికి వేలం వేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆళ్ల కొండబాబు,మామిడి సురేష్,సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గౌరమ్మ, నందీశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠ



గౌరమ్మ, నందీశ్వరుల విగ్రహాలను ఊరిగేస్తున్న భక్తులు

గంట్యాడ: నందెన్న సంబరాల్లో భాగంగా మండలంలోని బుడతాన పల్లిలో గ్రామస్తులు మంగళవారం రాత్రి గౌరమ్మ, నందీశ్వర విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ వత్రి అర్జునమ్మ ఆధ్వర్యంలో విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించి, గద్దె వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం పూజలు చేశారు. బుధవారం ఉదయం మహిళలు గౌరీపరమేశ్వరులకు పూజలు నిర్వహించారు.

19న 'రామాయణం'పై చిత్రలేఖనం పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన రామాయణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని సారథి విజయకోదండరామ ఆశ్రమ అధ్యక్షుడు టి.టి.వి.రమణమూర్తి తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను వికాసతరంగిణి కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణంలోని ముఖ్యసన్నివేశాన్ని విద్యార్థులకు పరిచయం చేయాలన్న ఉద్దేశంతో ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 8, 9 తరగతులు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వికాసతరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు పాల్గొన్నారు.

సొంత వనరులతో ఆదాయం



శిక్షణకు హాజరైన గ్రామ సర్పంచ్‌లు

శృంగవరపుకోట: గ్రామ పంచాయతీలు సొంత వనరులతో ఆదాయం సాధించడం ఎలా అన్న అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లపై ఆధారపడకుండా ఆస్తి పన్ను, నీటి పన్ను, మార్కెట్ ఫీజులు, వ్యాపార లైసెన్సులు, కన్స్యూమర్ చార్జీలు, చెరువుల్లో చేపల పెంపకం, ఉమ్మడి సహజర వనరుల వల్ల వచ్చే ఆదాయాలపై దృష్టి సారించాలన్నారు. ఈఓపీఆర్డీ లక్ష్మి మాట్లాడుతూ.. ఓన్ సోర్స్ రెవెన్యూ (ఓఎస్ఆర్) చాలా ముఖ్యమన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. పంచాయతీల హక్కులను పరిరక్షించేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో మానసిక ఆరోగ్యం మెరుగు



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ దుర్గాస్రవంతి

గజపతినగరం: మంచి అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని సమగ్రశిక్ష అభియాన్ జిల్లా కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ టి.దుర్గాస్రవంతి అన్నారు. మానసిక వారోత్సవాల్లో భా గంగా స్థానిక ప్రభుత్వబాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆరోగ్యకర జీవన శైలి, మైండ్‌ఫుల్ ప్రాక్టీస్‌పై బుధవారం అవగాహన కల్పించారు. నిద్రసమయం,స్నానం, స్క్రీన్‌టైమ్, నీరు, ఆహారం తీసుకునే అలవాట్లతో పాటు ప్రతీ అంశాన్ని వివరించారు.శరీర ధర్మాన్ని పర్యవేక్షించడం అనేది మానసిక ఆరోగ్యం యొక్క మొదటి మెట్టు అని అన్నారు. ఆరోగ్యకర జీవన శైలిని పాటించడం ద్వారానే మానసిక ఒత్తిడిని జయించి ఉన్నత లక్ష్యాలను చేరుకోగలమని స్పష్టం చేశారు.హెచ్ఎం చిప్పాడ రమేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి..

- వరి పంటకు ఆశిస్తున్న ఎండు ఆకు తెగులు
- శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు పిచికారీ చేయాలి
- ఏఓ నీలిమ



పూసపాటిరేగ:

ప్రస్తుతం వరి పంటకు ఎండు ఆకు తెగులు ఆశిస్తోందని.. ఈ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల వరి పంటకు ఎండు ఆకు తెగులు ఆశించిందని ఏఓ నీలిమ తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా నష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వరి పంటకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 21 వేల ఎకరాలలో వరి సాగు జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో తెగుళ్లకు సంబంధించి ఏఓ నీలిమ పలు సూచనలు, సలహాలు అందించారు.

కాండం తొలుచు పురుగు: నారు నుంచి పూత దశ వరకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే పిలక దశలో మొవ్వ చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది.

పాముపొడ తెగులు: ఈ తెగులు ఆశిస్తే దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు లీటర్ నీటిలో 2ఎం.ఎల్ హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేసుకోవాలి. ఎకరాకు 400 ఎం.ఎల్ మందును శాస్త్రీయ పద్ధతుల్లో పిచికారీ చేసుకోవాలి. లేదా ప్రొపికొనజాల్ 200 ఎంఎల్ సరిపడీ నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

ఆకుముడత తెగులు: ఈ తెగులు నివారణకు లీటర్ నీటిలో 2.5 ఎం.ఎల్ క్లోరిఫైరిపాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పైరు చిరు పొట్టదశలో ఉంటే ఎకరాకు ఎనిమిది కిలోల హైడ్రోక్లోరైడ్ గుళికలు పిచికారీ చేసుకోవాలి.

ఎండు ఆకు తెగులు : పొటాష్ లోపం వల్ల ఈ తెగులు ఆశిస్తుంది దీని నివారణకు ఎంఓపీ ఎరువు వేయాలి. మూడో దశలో 25 కిలోల ఎంఓపీ, 25 కిలోల యూరియా వేయాలి.



పూసపాటిరేగలో ఎండు ఆకు తెగులు కారణంగా దెబ్బతిన్న వరిసాగు

ఆదాయ వనరులు గుర్తించాలి



శిక్షణలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

చీపురుపల్లి: పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు స్వంత ఆదాయ వనరులను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో టి.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆర్‌జీఎస్ఏ కార్యచరణ ప్రణాళిక, ఓన్ రిసోర్స్ రెవెన్యూ(ఓఎస్ఆర్) అంశాలపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో ఆదాయ వనరులు పెరిగినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అందుకోసం స్వంత ఆదాయ వనరులు గుర్తించి వాటిపై పన్ను, పన్నేతర ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు ప్రణాళికలు రచించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి స్వంత ఆదాయ వనరులు వినియోగంలో భాగంగా వినూత్న ప్రాజెక్టులు ఏర్పాటుకు నిధులు సమకూర్చుకోవాలన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పనలో నైపుణ్యాలను శిక్షణలు తెలియజేస్తారని అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ ఆసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి క్షమించరానిది



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

చీపురుపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై దాడి క్షమించరాని నేరమని నియోజవకర్గ దళిత బహుజన సంఘాలు ప్రతినిధులు అన్నారు. సీజేఐపై సుప్రీంకోర్టులోనే దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సీజేఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి దేశంలో ఉన్న న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. అంతేకాకుండా ఉన్నత స్థానాల్లో ఉన్న అణగారిన వర్గాలపై జరిగిన కుట్ర అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని సీజేఐకు బహిరంగ క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘ ప్రతినిధులు గంటాన అప్పారావు, ఎంపి.రాజు, టొంపల సంజీవి, బూర సూర్యనారాయణ, యందవ పోలయ్య, బోడసింగి అప్పలరాజు, యు.రాము, దన్నాన రవి, ఎం.రాజేష్, ఎస్.దాసు, రేగిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి



మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ కౌన్సిలర్

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికతో చదువుకోవాలని, ప్రణాళికతో ముందుకు సాగితే మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చునని జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ మంజుభార్గవి విద్యార్థులకు సూచించారు. గరివిడి శ్రీరాంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించే విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మనసు చదువుపైనే ఉండాలని, అనవసరపు ఆలోచనలు దరి చేరనీయవద్దని సూచించారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటుగా ఆటలపై కాస్త ఆసక్తి చూపాలన్నారు. పరీక్షల సమయంలో ఆత్రుతతో రాయటం, సక్రమంగా రాయగలమో లేదోనని భయపడటం, పరీక్షల సమయం దగ్గర పడిన సమయంలో మాత్రమే పుస్తకాలు తీసి చదవటం ఇలాంటి కార్యక్రమాలు అన్నీ కూడా మానసిక ఒత్తిడికి గురి చేస్తాయన్నారు. ప్రతి రోజూ ఒకే సమయంలో ప్రణాళికతో చదువుకుని సిలబస్‌ను పూర్తి చేసుకుంటే ఎలాంటి మానసిక ఒత్తిడి కూడా దరిచేరదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి



ఓఎస్ఆర్ ప్రణాళికలకు సంబంధించిన కరపత్రాలను సర్పంచ్‌లతో కలిసి విడుదల చేస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు పంచాయతీలు సొంతంగా ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓఎస్ఆర్(ఓన్ సోర్స్ రెవెన్యూ)పై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండురోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. పన్నుల వసూళ్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీల పరిధిలో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారిని ప్రోత్సహించాలని, పంచాయతీ స్థలాల్లో దుకాణాలు నిర్మించి వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని చెప్పారు. గ్రామాల్లో ఉన్న ఆర్థిక వనరులపై పంచాయతీ కార్యదర్శులు నివేదికలు తయారు చేసి, వాటిపై గ్రామసభల్లో చర్చించాలని సూచించారు.

వరి పంటకోత ప్రయోగాలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఏఎస్ఓ కృష్ణ

లక్కవరపుకోట: వరి పంటకోత ప్రయోగాలపై మండలంలో రెవెన్యూ కార్యదర్శులు, వీఏఏలకు స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏఎస్ఓ బండారు కృష్ణ బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 32 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, పెద్ద గ్రామాల్లో నాలుగు చొప్పున, చిన్నగ్రామాల్లో రెండు చొప్పున పంట కోత ప్రయోగాలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. పంట పొలంలో 5 మీటర్ల పొడువు, వెడల్పులో పంటను కోసి, ధాన్యం తూకం వేసి దిగుబడి అంచనా వేయాలని అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి రవితేజ, ఉద్యానవన అధికారి పుప్పు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా అందని జీతాలు

గజపతినగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆరోగ్య శ్రీ పథకంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలకు రెండు నెలలుగా జీతాలు అందలేదని ఆరోగ్యమిత్ర ఉద్యోగుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ జెర్రి పోతుల ప్రదీప్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా జీతాలు అందక పోవడంతో ఆరోగ్య మిత్రలు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి జీతాలు చెల్లించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.